# ప్రయాణం

జరుగు బాబూ....కొంచెం జరుగు నాయనా....ఇంకెక్కడికి జరగను నాయనా! ....ముగ్గురు కూర్చునే సీట్లో ఇప్పటికే ఐదుగురం కూర్చున్నాం.... ఏం చేయను నాయినా ముసలోణ్ణి జెర జరుగు బిడ్డా.... ఇదేం ట్రేన్‌రా బాబూ ఇండియాలోని అధిక జనాభాకిది సింబలా?

అసలు నన్నడిగితే ఎన్టీవోడు వచ్చినంకనే దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఒక చోటికి చేరుతున్నాయి. ఏ మాటకామాటే చెప్పుకోవాలి ఈ ప్రభుత్వం బెటరేకదండి- అయ్యా మీ రాజకీయాలు కొంచెంసేపు ఆపుతారా— బండి కదిలినాక తీరిగ్గా మాట్లాడుకుందాంగాని....

అమ్మాయ్! మరచెంబు ఉందా? ఉంది బామ్మా—అబ్బ! ఎంత విశాలమైన కళ్ళు.... సన్నని నాజూకు ముక్కు ... దొండపండులాంటి ఎర్రని బుల్లి పెదాలు.... గుండ్రని మొహం ... అచ్చం బాపూ బొమ్మలాగుంది— అమ్మాయి శిరీషా ... కాసిన్ని మంచినీళ్ళు ఇస్తావ్! బాపు బొమ్మ పేరు శిరీష.... శిరీష.... శిరీష.... చక్కని పేరు—

హమ్మయ్య— ఇప్పుడు కదిలిందండి ట్రెయిన్— గంటలేటట....అంతే కదా!—అసలు ఇవాల్టి ట్రేన్లో ఇవ్వాళే ప్రయాణం చేస్తున్నందుకు సంతోషించాలండి—అంతే లెండి. అదే బ్రిటిష్ జమానాలోనైతే బండి అయిదు నిమిషాలు లేటయితే గార్డ్ నుంచి ఇంజన్ డ్రైవర్ దాకా అందరూ సంజాయిషీ రాసి ఇచ్చేవారట. పైవాళ్ళకు— అమ్మాయ్ శిరీషా మరచెంబు మూత సరిగా పెట్టావా.... .... ఊఁ....ఆ విసుగెందుకో....విసుగులోనూ శిరీష ఎంత అందమో....అందానికి నిర్వచనం లాంటి ఈ అమ్మాయిముందు కూర్చొని ప్రయాణం చేయడం ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో కదా!....నీకు పునర్జన్మల మీద నమ్మకముందటోయ్? .... ఇలాంటి సందర్భాలలో ఉంటుందిలే—

నిను వీడని నీడను నేనే....రేడియోనా....టేప్‌రికార్డరా....సౌండ్ కొంచెం తగ్గించరాదూ....

ఏమండీ! ఈ కిటికీ రెక్క— పైకనరూ— అప్పట్నుంచి ఇదే వరస-తన మీదికి ఒరిగే భర్తను లేపడానికి ఏదో ఒక పని చెబుతూనే ఉంది అర్థమవుతేనా ఆ మహానుభావుడికి—మిస్ట్రిమైండ్ ఫెలో— నీ సరసాలు ట్రేన్లోనా బ్రదర్! ఇంట్లో తీరిక లేదేమో.... కన్నె పిల్లలు మిమ్మల్ని చూడటానికి సిగ్గుపడుతున్నారోయ్....

బ్రహ్మచారికుర్రాళ్ళు మిమ్మల్ని చూసి ఇబ్బంది పడుతున్నారోయ్.... మనసులో అలల్ని ఆణుచుకోలేక పోతున్నారోయ్.... నా శిరీష చెంపలు చూడు సిగ్గుతో కెంపు లవుతున్నాయి.... "నీ శిరీష" ఏవిటోయ్? ఎవరో ముక్కూ-మొహం తెలియని అమ్మాయిని పట్టుకొని నీ, నా అంటావేం తప్పుకదూ.

నువ్వు కాసేపు ఊర్కోవోయ్.... నీ, నా అనేది ఊహల్లోనే కదా.... నిజంగా అంటున్నానా?.... ఊహల్లో ఏమైనా అనుకోవచ్చు. తప్పులేదులే—

ఇడ్లీ-వడ దోశ.... గరం గరం దోశసార్.

దోశ ఎంత నాయనా?

రెండు రూపాయల అరవై పైసలు సార్.

మానాయనే ముద్దుగా మూడు రూపాయ లనకపోయావా? నీ సొమ్మేం పోయింది? సెంట్రల్ గవర్నమెంట్ నడిపే ట్రేన్లో బిజినెసాయె.... అవున్లే వాళ్ళు టికెట్ల రేట్లు పెంచడంలా.... మీరూ పెంచండి —ధరలు పెరగడం. అభివృద్ధి చెందు తున్నాం. మూడు రూపాయలు పెట్టి దోశ కొనుక్కోండి—

కాఫీ ఎన్ని రూపాయలు బాబూ?

హహహ.... హహహ.... హహహ ఏవిటా మూకుమ్మడి పిచ్చినవ్వులు. వివిధ భారతి హవామహల్ ప్రభావమా బాబూ?

ఒక్కడే కొడుకు వొదినా.... ఎవరో కులంగాని పిల్లను- చేసుకుంటాడట.... వాడి మనసు మార్చు తండ్రీ అని మొక్కుకోడానికి తిరుపతికి పోతున్నాం—

మేమూ అందుకే వస్తున్నాం వొదినా తిరుపతికి- మా అమ్మాయి కూడా ఎవరో కులంగాని అబ్బాయిని ప్రేమించిందట- అతగాణ్ని తప్ప ఎవరినీ చేసు కోదట- ఇదేం కాలం వొదినా కులం మతం చూసుకోకుండా ఈ ప్రేమలేవిటి పెళ్ళిల్లేవిటి!

రోజుకో టెలివిజన్ కేంద్రం తెరుస్తున్నారు కదా! జనానికి వినోదం! తోటే కడుపు నిండుతుందా బావగారూ? మహానుభావుడు చలం ఏమన్నాడో తెలుసా? రాధ అయినా ఆకలితో నక నక లాడితే అన్నం కోసం వెదుకుతుందికాని కృష్ణుని కోసం కాదు- కడుపు నిండిన తరువాతే ప్రేమ, వినోదం.

అని నువ్వు, నేను అనుకుంటాంకాని బావా పల్లెజనానికేం తెలుసు టెలి విజన్‌ను చూసి పొంగిపోతారని ఏలినవారి ఆలోచన- వారి పత్రిక ఎడిటరొకసారి రాయనేరాశాడు కదా ఎడిటోరియల్‌లో- జనం దున్నపోతులు గొర్రెలు అని వెంటనే నేను ఉత్తరం రాశాననుకో- జనం నీకు దున్నపోతులు. గొర్రెల్లా కనబడుతున్నారా? రమీజాబీ కేసును అప్పుడే మరిచిపోయావా? నీ పార్టీని గెలిపించకపోతే జనాన్ని ఇలా తిడ్తావా? ఆ ఉత్తరం పత్రికలో వేశాడా? ఎందుకు వేస్తాడు? అయినా పత్రి కలో పడటానికి రాశానా అతగాడి గుండెలో పడటానికిరాశానుగాని....

అబ్బ కొంచెం జరగండి, వీడి సరసం మండిపోనూ, ఆమె చుట్టూ చేతులేసి చెంపకు చెంప ఆనించి. ఏం నాయనా? కిటికీ నుంచి ఏకోతో వచ్చి నీపెళ్ళాన్ని ఎత్తుకు పోతుందా? నలభై సీట్ల కెపాసిటి కంపార్ట్‌మెంట్‌లో నాలుగు వందల మందిమి ఉన్నాం. ఇది బెడ్‌రూమ్‌లా కనిపిస్తుందా బాబూ నీకు?

చూడు శిరీషా! గేటుకు తాళం వేశావా? వేశారే బామ్మా! లాగి చూశావా? చూశాను బామ్మా! రావూ? అలా గుసకలు వేస్ట్‌చేసుకోమాక? ఆ అమ్మాయి పత్రిక మీది నుంచి నిన్ను చూస్తున్నదోయ్! నీ పేరేంటి నాయనా?

నాపేరా.... నాపేరేనా బామ్మా....ఓరుగంటి సాంబశివరావండి? అది కాపిటల్ లెటర్స్‌లో ఫుల్‌నేమండి. ఇక షార్ట్ పేరా అండి రావు అండీ. ఆహా....ఏం చదువుతున్నావు నాయనా? నేనే కదండి....నేనేం చదవట్లేదండి.... మీ శిరీషగారు మాత్రం పత్రిక చదువుతున్నారండి.... అబ్బ శిరీష ఎంత అందంగా నవ్విందో. రావూ నీ జోక్ బ్రహ్మాండంగా పేలిందోయ్.... పత్రిక కాదు నాయనా ఏం చదువుతున్నావు అని అడుగుతుండా. ఓహో! ఆ చదువాండి మొన్ననే బి. కాం ఫస్ట్‌క్లాస్‌లో పాసయానండి. మా అమ్మ ఒకసారి తిరుపతికి పోయిరమ్మన్నదండి. అందుకే బయలు దేరానండి. మీలాంటి మంచి మనుషుల్ని కలుసుకున్నానండి. ప్రయాణం ఎంత బోర్‌గా ఉంటుందోనని కంగారు పడ్డానండి. దానికే నాయనా అందరి ప్రయాణం ఆక్కడికేకదా ఒకరి కొకరం తోడుగా ఉంటేనే ప్రయాణం కులాసాగా ఉంటుంది.

చూడు రాకేశ్‌శర్మా! నువ్వు రాకెట్‌లా రయ్యన అటుకమీదికి దూసుకు పోతున్నావుగాని ఇందిరాగాంధి ప్రతిపక్ష ప్రభుత్వాల్ని తోసేసినట్లు మా మూటల్ని కిందికి తోసెయ్యకు నాయనా. అందులో ఆవకాయ జాడీ ఉంది. ఆవునెయ్యి సీసా ఉంది. మా మనవడు తిరుపతి యూనివర్సిటీలో చదువుతున్నాడులే. పట్టు కెళ్తున్నా.

బావగారూ శంకరాభరణం సినిమా చూశారా? చూసే ఉంటారు. అందులో మానస సంచరరే అనే పాటలో వాణీజయరాం గొంతువిన్నారా! మధురమైన గాత్ర మంటే అదండి. ఎంత గొప్పగా చిత్రీకరించాడు మన విశ్వనాథ్? ఆ పాటను ఆ వెన్నెల, కొబ్బరిచెట్టు ఓహో మరపురాని మధురఘట్టమండి.

ఎన్టీవోడు ఎన్టీసి మీటింగ్‌ను అదర గొట్టేశాడండి. ఆ మాత్రం ప్రొటెస్ట్ ఉండాల్సిందేనండి. అప్పుడే కదండి- ప్రజాస్వామ్యం కొనఊపిరితోనైనా బతికేది.

అయితే వొదినా మా అబ్బాయిలాగే మీ అమ్మాయి కూడా కులాంతర వివాహం చేసుకుంటానని పట్టుదలతో వుంది అంటారు. ఏం చదువుతున్నది వొదినా? మొన్ననే బి. ఏ. పూర్తిచేసి ఎం. ఏలో చేరింది వొదినా. ఎక్కడా హైద్రాబాద్‌లోనేనా ఆ.ఆ హైద్రాబాద్‌లోనే. మా అబ్బాయి ఎం. కాం. చదువుతున్నాడు వొదినా. ఏమండి బండి ఆగింది. వొదినగారికి కూడా ఓకాఫీ పట్రండి. ఎందుకులే వొదినా మాకు ఫ్లాస్క్‌లో ఉంది. ఉండనివ్వండి. ఈసారికి నేనిచ్చే కాఫీ తీసుకో వొదినా. కావా

లంటే మీ ఫ్లాస్క్‌లోని కాఫీ తరువాత నాకిద్దువు గాని. సరే వొదినా అట్లాగే కానీ. అన్నయ్య చేసేది ఉద్యోగమా, వ్యాపారమా వొదినా.

అమ్మాయ్ శిరీషా బండి ఆగినట్టుంది. మరచెంబులో మంచినీళ్ళు అయిపోయినట్టున్నాయి. ఈ అబ్బాయి రావుకివ్వు -ఫ్లాట్ ఫారం మీదికెళ్ళి నింపుకొస్తాడు. పెదవి విప్పడు. కళ్ళతో మాట్లాడటం ఈ అమ్మాయి దగ్గరున్న గొప్పకళ. మరచెంబు ఇటివ్వండి. అమ్మో షాక్! ఆ నాజూకు వేళ్ళు ఆలా తాకాయో లేదో షాక్. మరచెంబూ నువ్వింకా చిన్నదానివి కాకూడదూ? ప్రతి స్టేషన్లో ఇలాగే దాహ్మకు నీళ్ళు తెచ్చి ఇద్దును కదా.

నాన్నారూ నాన్నారూ ఈ ట్రెయిన్ ఎవరు తయారు చేశారు? ఒక పెద్ద ఇంజనీరలే. ఇంజనీర్‌ను ఎవరు చేశారు? ఎవరా ఎవరంటే దేవుడు. దేవున్నెవరు చేశారు? దేవున్నా దేవున్ని దేవున్ని నేం చెప్పనా నాన్నారూ? ఏదీ చెప్పు మనం.... మనమా! ఆ అవును నాన్నారూ మట్టితో నేను కిష్టుడి బొమ్మ చేస్తాగా. కిష్టుడు దేవుడు కదా! అవును తల్లీ అవును.

"ఏడూ కొండల స్వామి ఎక్కాడున్నావయ్యా ఎన్ని మెట్లెక్కినా కానరావేమయ్యా."

మహాగాయకుడు అమరగాయకుడు ఘంటసాల మళ్ళీ నీలాంటి గాయకుడు మాకెప్పుడు దొరుకుతాడయ్యా.

బాబూధర్మం....చేయండి బాబూ గుడ్డివాళ్ళంబాబూ....ఏమిటో నీ మాయ తెలియా కున్నామయ్యా!

"ఏంగురూ కనిపించడమే మానేశావ్? ఆ మా కొత్తాఫీసర్ మా చెడ్డాడూ గురు." పదిన్నరకు ఆఫీసుకొచ్చి సరిగ్గా ఐదు గంటలకు వెళ్తాడు. ఇదివరకటిలా గంటలు కొలది సిట్లోదిలి మార్నింగ్ షోలకి. మిత్రులను కలవడానికి వెళ్ళలేక పోతున్నాం. రాబడి కూడా తగ్గిపోయింది గురూ- మా ఆఫీసర్‌ను ట్రాన్స్‌ఫర్ చేయాలని స్ట్రయిక్ చేద్దామనుకుంటున్నాం. మాస్ట్రయిక్ సక్సెస్ కావాలని మొక్కి రమ్మని స్టాఫంతా నేను సెక్రటరీని కదా తిరుపతికి పంపుతున్నారు గురూ. నువ్వేటూ తిరుపతికేనా? ఏవిటీ విశేషం....ష్ ఇలారా చెవిలో చెప్తా. మా ఊరి చెరువుకట్ట తెగిపోయేట్టు చేయమని దేవునికి మొక్కుకోడానికి వెళ్తున్నా గురూ.

చెరువు కట్ట తెగితే పొలాలకు జనానికి నష్టం కాదూ....కానీ అయితే నాకేం ....రాత్రిపూట కట్టతెంపేయడానికి మనుషుల్ని సిద్ధం చేశాను - కాని పని సక్సెస్ కావాలి కదా....అందుకే ఈ ప్రయాణం....ఆ కట్ట మరమ్మత్తు కాంట్రాక్టు నాకు కాకుండా ప్రతిపక్షం పార్టీ గాడికి వెళ్ళింది. కట్ట కూలిపోతే వాడి పలుకుబడి పడిపోతుంది కదా - అదే అదనుగా జనాన్ని పోగుచేసుకొని మనం విజృంభించవచ్చు. అమ్మో అమ్మో ఏం రాజకీయం గురూ.

టికెట్ టికెట్‌సార్... ఇదిగోసార్! నీ బొజ్జ నాయకుల బొజ్జలా పెరిగిందేం సార్....

పల్లీ బఠాని, పల్లీ బఠాని టైం పాస్ పల్లీలుసార్. గరం గరం పల్లీలు సార్....

వొదినా ఈ ఫలహారం కాస్త తీసుకోండి....ఫ్లాస్కులో కాఫీ వంచుతున్నా తాగుదురుగాని....ఎందుకులే వొదినా. మీరు తినండి ....మేం తింటాంగాని తీసుకో వొదినా ....అన్నయ్యాగారూ మీరుకూడా తీసుకోండి ... నిన్ను చూస్తుంటే మా చెల్లెలు గుర్తుకొస్తున్న దమ్మా -అన్నయ్యా అన్నయ్యా అని నీలాగే నోరారా పిలి చేది....ఇప్పుడెక్కడ ఉంది అన్నయ్యా....చిన్నప్పుడే మమ్మల్ని విడిచి వెళ్ళి పోయిందమ్మా—నాలుగో తరగతి చదువుతున్నప్పుడు బండిమీద నుంచి పడి పోయిందమ్మా - ఆసుపత్రికి తీసుకపోయే సరికే ప్రాణాలు పోయాయి— అయ్యయ్యో ఎంతపని జరిగింది అన్నయ్యా....ఇన్నాళ్ళకి మళ్ళీ నీలో నాచెల్లెలు రూపం కనిపించిందమ్మా....అంతా దైవఘటన అన్నయ్యా....విచారించకండి.... నేనే మీ చెల్లెల్ని అనుకోండి....ఫలహారం తీసుకోండి అన్నయ్యా....

రష్యా గొప్పదా?....అమెరికా గొప్పదా?....ఏదీ గొప్పది కాదు—అన్నింటి కంటే మనదేశమే గొప్పది. వాళ్ళిప్పుడిప్పుడు చంద్రమండలంమీదికి పోతున్నారు. గాని మనవాళ్ళు కొన్ని యుగాలక్రిందటే ఒక్క చంద్రమండలమే కాదు స్వర్గము వైకుంఠము అన్నీ తిరిగొచ్చారు. ఈ టెలివిజన్లు ఇప్పటి వనుకుంటున్నారా? మన మాయల పకీరు ఏనాడో బాలనాగమ్మను టెలివిజన్‌లో చూసి మోహించాడు - టెలీ పతి, వైర్‌లెస్‌లు అన్నీ మన వాళ్ళెప్పుడో వాడేశారు సుమండీ. ద్రౌపది....కృష్ణా అని మొరపెట్టుకోగానే కొన్ని వందలమైళ్ళ దూరంలో నున్న కృష్ణునికి ఎలా విన పడిందంటారు? .... అణుశక్తి కంటే ఈ అతీంద్రియ శక్తులు గొప్పవని రష్యా శాస్త్రజ్ఞుడు డాక్టర్ వాసిలీవ్ పంథొమ్మిది వందల అరవైలోనే చెప్పాడు. టెలీపతి ద్వారా ఎదురుగా లేదా ఎంతో దూరంలో నున్నవారి మనసుకి సందేశాలు పంప వచ్చును - క్లియర్ వాయంట్లుఅంటే తెలుసాండీ....అవేం వారంటండి-వారంట్లు కాదు....వాయంట్లు....క్లియర్ వాయంట్లు అనబడేవారు ఎక్కడో జరుగుతున్నవి కళ్ళకు కట్టినట్లుగా చెప్పగలరు. మహాభారత సంగ్రామాన్ని ధృతరాష్ట్రుడు ఇలాగే కదా విన్నాడు - సైకోకెనసిస్ అనబడే ప్రతిభావంతులు కళ్ళతో చూస్తూ తాకకుం డానే వస్తువులలో కదలిక తెప్పిస్తారు. అలాంటి పనులు చేయడంలో ప్రపంచ మంతా గుర్తించిన ప్రముఖ రష్యా మహిళ ఎవరో తెలుసాండి....తెలియదండి.... ఆమె పేరు నెల్యామిఖాయిలోవా....ఆమె మీద తీసిన చిత్రాలు ఇప్పటికీ రష్యాలోనే కాక అమెరికా, ఇంగ్లండు దేశాలలో కూడా ప్రదర్శిస్తుంటారు....అలాగా....ఆఁ.... మరేమనుకున్నారు....ఇలాంటి శక్తులన్నీ మనవాళ్ళెప్పుడో కైవసం చేసుకున్నారు కదా....ఏదో కాలం కలిసిరాక, గ్రహణం పట్టినట్లు ఉందికాని మన దేశం ప్రపం

చంలోని అన్నిదేశాలకంటె గొప్పదండి-మన దేశంలో జన్మించినంత మంది మహాత్ములు మరే దేశంలోనూ లేరండి – బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు, గురునానక్, రామకృష్ణపరమహంస, వివేకానందుడు, అరవిందుడు, మహాత్మాగాంధీ .... ఇలా ఎందరెందరికో జన్మనిచ్చిన పుణ్యభూమి అండి మనది. ప్రపంచంలోని అన్ని దేశాలకంటె మనదేశమే గొప్పదండి. మనం చాలా గొప్పవాళ్ళమండి.

ఎంత చెప్పినా వినవే మనసా....ఏ మనందు నిన్నూ....అయ్యా ధర్మం చేయండి బాబూ....ధర్మం చేయండి తల్లీ....

నాన్నారూ....నాన్నారూ....పైసలివ్వరూ వాళ్ళకేస్తాను .... చిల్లరలేదమ్మా అమ్మమ్మ నాకిచ్చిన రూపాయిలేదూ....అది వేయనా?....తప్పమ్మా! అంత డబ్బు వేయకూడదూ....నాన్నారూ మన దేశం భారతదేశం కదూ?....అవును తల్లీ ....మరి ఈ అడుక్కునే వాళ్ళది ఏ దేశం? .... వాళ్ళదీ భారతదేశమే....మనది భారతదేశమే... వీళ్ళదీ భారతదేశమేనా!....మనం అడుక్కుంటూలేం కదా....వీళ్ళెందుకు అడుక్కుంటున్నారు. చెప్పండి నాన్నారూ....ఎందుకు అడుక్కుంటున్నారంటే.... వాళ్ళు పూర్వజన్మలో పాపం చేసుకున్నారమ్మా....అందుకే ఈ జన్మలో అడుక్కుంటున్నారు....ఉఁహూఁ అలాగా....మరి వాళ్ళకు పైసలెయ్యకపోతే పాపం కదా నాన్నారూ?....నీకు తెలియదు ఊరుకోమ్మా చిన్నపిల్లవూ... ఎంతమందికని వేస్తాం?

చలంలేడు - విశ్వనాథలేడు - దేవులపల్లి, శ్రీశ్రీలులేరు. కొడవటిగంటిగారూ లేరు. ఉన్న రాచకొండగారు ఏ పత్రికలోనూ దర్శనం ఇవ్వడేమిటండి?

అయ్యా బెర సుట్ట తాగుడునా దాంచెను శానా సేపటికాంచి కుతిలేత్తాంది. ఏయ్ ముసలాయినె సుట్టతాగుతావ్, బాగా నది గమ్మున కూనో. అయ్యాగాడ్దొర సిగలేటు తాగంగరాంది నేను సుట్టతాగుతె వాత్తాది బాగ.

"పంజాబ్‌లో సైనికచర్య పొలిటికల్ జిమ్మిక్కు. అంటారా?, కాకపోతే మరేంటండి. భింద్రన్‌వాలా స్వర్ణదేవాలయాన్ని పెద్ద ఆయుధాగారాన్ని చేశాడుకదా. ఇప్పటిదాకా ప్రభుత్వానికి ఆ విషయమే తెలియలేదా! ఎన్నికలదాకా సమస్యను లాక్కుపోతే ఇంత ఆలస్యానికి మరో కారణమేమిటో చెప్పండి చూద్దాం. ఇప్పుడు రోజుకో టి. వి. ప్రసార కేంద్రం నెలకొలుపుతున్నారు కదా. ఈ టి. వి. కేంద్రాలు....లోన్ మేళాలు....ఇవన్నీ పొలిటికల్ జిమ్మిక్కేనండి. మన కిలో బియ్యం రెండురూపాయల పథకాన్నే పొలిటికల్ జిమ్మిక్స్ అంటారేవండి? అయ్యా అవన్నీ పాలిటిక్స్. పాలిటిక్స్‌లో ఎదుటిపక్షం చేసే ప్రతి పని తప్పుగానే కనబడుతుంది.

బామ్మగారూ ఇంద-ఈ కాఫీ అందుకోండి. మానాయనే....మానాయనే....నా కోసం కాఫీ తెచ్చావా తండ్రీ. నువ్వు చల్లగా నూరేళ్ళు వర్ధిల్లు నాయనా.

వచ్చే సిరీస్ మన క్రికెట్ జట్టుకు గవాస్కర్ క్యాప్టెన్గా ఉంటాడా? కపిల్ దేవా? ఎవరున్నా టీమ్ కోస్పిరిట్ కావాలండి. టీం స్పిరిట్ అనేది దీపానికి నూనె లాంటిదండి.

రాజకీయాలు ఎంతగా పతనమైపోయాయండి బావగారూ. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విదేశాలకు వెళ్ళి ఛండాలపు పనులు చేసివస్తే నోరు మెదపని వాళ్ళంతా మన ముఖ్యమంత్రి అమెరికా పర్యటనను దుయ్యబడతారేమిటండి!

అరేయ్ కిశోర్ వచ్చిలేడా? యాడ కనిపించదు. రాలేదురా. వాడు పరీక్ష ఫెయిల్ అయినాడుకదా. నేన్ భీ ఫేల్ అవుదును. నా ముందు సీట్ల కూసునోడ్నడు మంచోడ్రా కాసిమ్. కిశోర్‌భాయి పాస్‌కాలేడు. ఎందుకురా. వైస్ ఛాన్స్‌లర్ స్ట్రిక్టుగా పరీక్షలు రాయిస్తున్నాడు కదా. వాడికేం పోయేకాలంరా....

అనుకున్నామని జరగవు అన్ని. అనుకోలేదని ఆగవుకొన్ని. జరిగేవన్ని మంచికని అనుకోవడమే మనిషి పని. నీ సుఖమే నే కోరుకున్నా.

ఇడ్లీ.... వేడి వేడి ఇడ్లీసార్.

ఏవండి ఇడ్లీ తీసుకోరూ. అంతగా భార్య నోరు విడిచి అడుగుతోంది కదా. ఆ కొండముచ్చు భర్తగాడు పట్టించుకోడేం సినిమా పుస్తకంలో లీనమై పోయాడు ఇడియట్. ఆమె గర్భవతి. పాపం ఆకలేస్తున్నదేమో....చూసి చూసి కొడుకుచేతిలో పాకెట్‌లోంచి రెండు బిస్కట్లు తీసుకొని తింటున్నది. అమెరికా వాళ్ళు పంపిన రాకెట్ గలాక్సీ దాటి వెళ్ళిందట. అయినా సమాచారాలు అందుతున్నాయట.

అబ్బ! సరిగా కూర్చోండి. ఇదేం సరసంరా వీడికి పది మందిలో. రేపు నువ్వూ అంతేలే. ఛీ! ఛీ! అలా ఎన్నటికీ జరగదు. పోనీ శిరీషనే చేసుకుంటా ననుకో-ఇలాగే దూరంగా కూర్చుంటావా? ఎందుకూర్చుంటాను? అనుకునే కూర్చుంటా. అంత మాత్రాన యిలా మూర్ఖంగా ప్రవర్తిస్తానని అనుకుంటున్నావా? ఉహూఁ, ఎక్కడ నాయనా మనం ఉండేది?, నన్నేనా బామ్మా నన్నేకదూ....చిక్కడ పల్లిలో-చిక్కడపల్లి లో మేముండేది. అక్కడే నాయినా హనుమంతుని గుడి ఉందికదా. అదేలైన్‌లో సుందరకాండగానం చేసిన సుందరదాసు లేడూ, అదే మన యం.యస్. రామారావుగారు నాయనా. ఆఁఆఁ....వారి ఇంటి ప్రక్కనే నాయనా మా ఇల్లు. అప్పుడప్పుడు వచ్చి పోతూ ఉండు. తప్పకుండా వస్తాను బామ్మా. తప్పకుండావస్తా. ఏడుకొండలవాడా వెంకటరమణ నువ్వెంతటి దయామయుడవు తండ్రీ. శిరీష అనే ఈ అందాల బొమ్మతో నాకు పరిచయాన్ని పెంచవా. ఆ పరిచయం ప్రేమగా మారి మేము పెళ్ళి చేసుకునేట్లు ఆశీర్వదించు తండ్రీ. నా కోరిక నెరవేరుస్తే నీకు నిలువుదోపిడ ఇస్తాను తండ్రీ. చూడు మిస్టర్ రామ్ .... మొక్కులు. మొక్కుబడులు ఇవన్నీ మూఢ నమ్మకాలని నీ అభిప్రాయంకదూ. అవును, కాని ఇలాంటి సందర్భాలలో కాదులేవోయ్. నీకూడా ఆ పోలికలు వచ్చేశాయి. అందుకే అన్నారు యథారాజా తథా ప్రజా అని. చూడు అంతరాత్మా.

ఇలా మాటి మాటికి నన్ను ప్రశ్నించకు. అదిగో శిరీష చూస్తోంది. ఎంత అంద మంది ఆ ఓరచూపుల్లో, శిరీషా....శిరీషా....ఐ లవ్ యూ శిరీషా.

వొదినా మీ ఒళ్ళేమిటి ఇంత వేడిగా ఉంది. జ్వరం వొదినా, చలిగా వుంది. అల్లాగా - ఏమండి వొదినగారికి చలి జ్వరం వచ్చింది. మీ దగ్గర టాబ్లెట్లు ఉన్నాయికదా- ఆఁ - ఆఁ. ఇదిదిగో. వొదినా నోరు తెరవండి. టాబ్లెట్ మింగి వేడి కాఫీ తాగుదురు. ఈ బ్లాంకెట్ కప్పుకోండి. వెచ్చగా ఉంటుంది. మీ కెందుకు వొదినా ఈ శ్రమ. భలే వారే ఇందులో శ్రమేం ఉందండి. మా ఆడుబిడ్డకు ఈ మాత్రం సేవచేయకూడదా వీడియోలు వచ్చినప్పట్నించి కుర్రకారు మరీచెడిపోయా రండి బావగారూ. పల్లెటూళ్ళలో వాటి విషపు జల్లులు కురుస్తున్నాయి - రోజు రోజుకు మానభంగాలు పెరుగుతున్నాయంటే పెరగవూ మరి- ఆ వీడియోల్లో చూపించే సినిమాలు ఎటువంటివని ఇంకా ఎలాంటి పరిస్థితులు వస్తాయో చూడండి- అసలు నన్నడిగితే కావాలనే ఎవరో యిదంతా చేస్తున్నారు. యువకులను చెడగొట్టి వాళ్ళను దుర్బలులను, గొర్రెలను చేయడానికే యిలాంటి ప్లాను.

ఇది కుళ్ళిన సంఘం....దీని కీళ్ళు విరిచివేయాలి. వేళ్ళు నరికివేయాలి.

మీ మనసు అన్నయ్య మనసు ఎంత చల్లనిది వొదినా. మీలాంటి అత్త మామలు ఉన్న యింట్లో పడే అదృష్టం నా కూతురుకు లేదాయె.

మేమూ అదే అనుకుంటున్నాం వొదినా-మా వాడికి మీలాంటి ఉత్తమ కుటుం బంలోని పిల్లలయితే ఎంత బాగుండేదోనని—

బామ్మా మరచెంబులో నీళ్ళయిపోయాయే- ఏదో స్టేషను వస్తున్నట్టుంది. రావుకు యివ్వమ్మా—రావూ బండి ఆగగానే కొంచెం నీళ్ళు తెచ్చిపెట్టు నాయనా- మహా భాగ్యం బామ్మా మహా భాగ్యం-

మీరుండేది ఎక్కడన్నారు ఒదినా-సికింద్రాబాద్ మారేడుపల్లిలో. మారేడు పల్లిలోనా మీ అబ్బాయి పేరు- చంద్రశేఖర్ - విచిత్రంగా ఉందే. మా అమ్మాయి ప్రేమించిన అబ్బాయి పేరు కూడా చంద్రశేఖరే. వాళ్ళుండేది కూడా మారేడుపల్లి లోనేనట. అలాగా-మీ అమ్మాయి పేరేమిటన్నారు వొదినా- నీరజ, నీరజనా, మా అబ్బాయి ప్రేమించిన అమ్మాయి పేరు కూడా నీరజే. మీరుండేది హిమాయత్ నగర్లో కదూ. అవును- అయితే మా అబ్బాయి ప్రేమించింది మీ అమ్మాయినే - ఒదినా.

బొమ్మలు, బాబూ బొమ్మలు- రంగు రంగుల బొమ్మలు- ఈ జంటను చూడండి బాబూ కొత్త దంపతులు బాబూ కులాంతర వివాహం చేసుకున్నారు బాబూ- అబ్బాయి కట్నాలకు అమ్ముడుపోలేదు బాబూ. ఆదర్శ వివాహం బాబు. కులంకాదు గుణం ప్రధానం బాబూ-అమ్మా ఆశీర్వదించండి-అయ్యా ఆశీర్వదించండి.

వొదినా నేనో మాట చెప్పనా - చెప్పు వొదినా. మా అబ్బాయికి మీ అమ్మాయిని చేసుకుంటాం వదినా. ఏమండీ విన్నారా- మీ రేమంటారు బావ గారూ....శుభం- మా అమ్మాయి ఎంతో అదృష్టవంతురాలు వొదినా!

నాన్నారూ నాన్నారు-పాడనా నాన్నారు-పాడవమ్మా ఏదీమేం కూడా వింటాం-.

"గాలికీ కులమేది ఏదీ నేలకు కులము."

........

........

"ధర్మం నీతో నడుచునులే."

"దైవం నీలో నిలుచునులే"

గాలికీ కులమేది!

ఆదివారం వీక్లీ - *10-2-1985.*